విపుల - జనవరి 2004

# క్షంతరోషం

నారాయణ తల్లికి ఒంట్లో చాలా సుస్తీగా ఉందని కబురందింది. అతగాడి ముగ్గురక్కలూ, బావలూ ఏకుమ్మడిగా హైదరాబాద్ నుంచి శాతవాహనలో బయలుదేరి విజయవాడ చేరుకొన్నారు. రాత్రి పదకొండింటికి తలుపు తట్టిన చప్పుడు విని, లేచి తలుపులు తీసిన నారాయణ ఎదురుగా అక్కలూ, బావలూ కనబడ్డంతో ఒక్కసారిగా విస్తుపోయాడు. వెంటనే తేరుకొని బయటకు వెళ్లి రెండు ఆటోరిక్షాల్లోని వాళ్ళ సామాన్లు ఒకటొకటిగా లోపలికి చేరవేశాడు.

"చెప్పాపెట్టాకుండా వచ్చేశారు. అనుకోకుండా కనకదుర్గ ఉత్సవాలుకాని చూడాలనా?" నారాయణ నవ్వుతూ అడిగాడు.

"రెండు నెలలుగా మంచం పట్టి ఉందనీ, మిమ్మల్నందర్నీ చూడాలని మీ అమ్మ అంటోందనీ పక్కింటి సుందరం పిన్ని ఈ ఉదయం టెలిఫోను చేస్తే ఉన్నట్టుండి బయలుదేరి వచ్చేశాం. అమ్మకెలా ఉంది?" నారాయణ పెద్దక్క ఆత్రుతతో ప్రశ్నించింది.

"సుందరం పిన్ని క్రాస్‌బోర్డర్ టెర్రరిజం అన్నమాట ఇది?! మిమ్మల్నందర్నీ అనవసరంగా కంగారుపెట్టడం ఎందుకని, నేను మీకెవరికీ తెలియబర్చలేదు. ఎలాగూ వచ్చేశారుకదా – గదిలోకి వెళ్లి అమ్మని చూసి రండి" అన్నాడు నారాయణ నిర్లిప్తంగా.

అంతవరకూ నిశ్శబ్దంగా ముసుగుదన్ని పడుకొన్న పార్వతమ్మ కూతుళ్లు వచ్చిన సంగతి గ్రహించి సన్నగా మూలుగు మొదలు పెట్టింది. గదిలో పెద్దలైటు స్విచ్ వేసి, పెద్ద కూతురు మంచం దగ్గరకు వెళ్లి తల్లి పక్కలో కూర్చుని, "ఎలా ఉందమ్మా?" అని అడిగింది.

రెండో కూతురు తల దగ్గర కూర్చుని తలా, ఆఖరి కూతురు కాళ్ల దగ్గర కూర్చుని కాళ్లూ పట్టసాగారు.

"వచ్చారమ్మా! నా బంగారాలే! మిమ్మల్ని చూడకుండానే వెళ్ళిపోతాననుకొన్నాను కాని సుందరమ్మ దయవల్ల మిమ్మల్ని చూడగల్గుతున్నాను. రెణ్ణెల్లనుంచీ ఒకటే గాభరా! లేస్తే కళ్లు తిరుగుతున్నాయి నడుం నొప్పీ, కీళ్ల సలుపులూ. తింటే అరగదు, తినకపోతే నీరసం! మనిషి అసరా లేందే అడుగు వెయ్యలేకపోతున్నాను" అంది పార్వతమ్మ పెద్ద కూతురి చేతిని తన చేతిలోకి తీసుకొంటూ.

"అమ్మా, నాన్నగారు స్పెషలిస్టులవద్దకు తీసుకువెళ్లలేదా!" ఆఖరి కూతురు ప్రశ్నించింది.

"చూడవలసిన వాళ్లకే శ్రద్ధ లేనప్పుడు వానప్రస్థంలోకి దిగజారిపోయి, నడుం వంగిన నాన్నగారేం చేస్తారు?" అని సమాధానం చెప్పి, గదిలో గుమ్మం దగ్గర నిల్చుని ఉన్న ముగ్గురు అల్లుళ్ళనీ ఉద్దేశిస్తూ, "అయ్యయ్యో మీరు ముగ్గురూ నిల్చునే ఉన్నారు. కబురందగానే తీసుకొచ్చారు. అదే చాలా సంతోషం" అంది. అత్తగారి దగ్గర హాజరు వేయించుకొన్న ముగ్గురు అల్లుళ్లూ హాల్లోకి అడుగు పెట్టారు. నారాయణతో నెమ్మదిగా మాట్లాడుతోన్న అతని భార్య నిర్మల వీళ్లని చూడగానే మాటలాపి, ఆడపడుచుల్ని పలకరించడానికి అత్తగారి గదిలో అడుగు పెట్టింది.

"చిన్నబావగారూ, మీరెప్పుడో మధ్యాహ్నమనగా తిని, ఆ తర్వాత హడావుడిగా బయలుదేరి ఉంటారు. ఇవ్వాళ నెలాఖరు రోజు. నా దగ్గర నయాపైసా కూడా లేదు. అర కిలో బియ్యమూ, పావు కిలో దొండకాయలూ తప్ప ఇంట్లో సరుకులన్నీ నిండుకున్నాయి. మీరో వందరూపాయి లివ్వండి కాంప్లెక్స్ కేంటీన్ నుంచి ఏవైనా టిఫిన్లు తీసుకువస్తాను" అన్నాడు నారాయణ రెండో బావగారి వైపు చూస్తూ.

"దానికేముంది. అలానే ఇస్తాను. కాని రేపటి సంగతి? మీ అమ్మా, నాన్నా తమ్ముడూ?..." అర్ధాంతరంగా ఆపేశాడు నారాయణ చినబావ, నారాయణ చేతికి వంద రూపాయల నోటు అందిస్తూ.

"నేను రేపు జీతం అందుకొని కొంత పాతబాకీ చెల్లించి సరుకులు తీసుకురావాలి. అది సాయంత్రానిక్కానీ జరగదు. ఆ అర కిలో బియ్యమూ, దొండకాయలూ వాళ్ల ముగ్గురి రేపటి పదకొండు గంటల భోజనానికి నిర్మల జాగ్రత్త చేసి ఉంచింది" అంటూ ఓ సంచీ తీసుకొని బయటకు వెళ్లాడు.

"పరిస్థితి ఇంతిలా దిగజారిపోయిందా?" నారాయణ మూడో బావ అన్యాపదేశంగా అన్నాడు. పెద్ద బావగారేదో అనబోయి ఆగిపోయాడు. లోపలి గదిలోంచి అత్తగారి మాటలు వినవస్తున్నాయి.

"పలకరింపులు చాలుకాని, వీళ్లెప్పుడనగా తిని వచ్చారో ఏమో, వంట ప్రయత్నాలు మొదలుపెట్టు"

"ఇంట్లో సరుకులన్నీ నిండుకొన్నాయి. మీ అబ్బాయిని హోటల్నుంచి ఏవైనా పార్శిల్ చేయించి తీసుకురమ్మన్నాను. ఎందుకంటే ఇప్పుడు సరుకుల దుకాణాలేమీ తెరిచి ఉండవు. తెరిచి ఉన్నా ఆయన దగ్గర డబ్బు లేదు. టిఫిన్లు తీసుకురావడానిక్కూడా రెండో బావగారి దగ్గర చేబదులు తీసుకొంటానని చెప్పారాయన" అంది నిర్మల నిజాన్ని దాచకుండా.

"రాకరాక ఆడపడుచులొస్తే బాగానే గౌరవిస్తున్నారు వాళ్లని. చోద్యమంతా నీ మాటల్లోనే ఉంది. అయినా..." – అటుపైన దగ్గొచ్చి మాట్లాడలేకపోయింది పార్వతమ్మ.

"ఇంత రాత్రి ఇరుగుపొరుగుల్ని నిద్రలేపి, డబ్బు అప్పు అడగలేరు కదా! అక్కా బావలెప్పుడనగా తిని వచ్చారోనన్న ఇదితోనే ఆయన అభిమానం చంపుకొని ఇంటికొచ్చిన అతిథుల్నే అడిగి తీసుకొని వెళ్లాల్సివచ్చింది. లేకపోతే నేనూ, ఆయనా భోజన ప్రసక్తి తీసుకురాకుండానే మౌనంగా ఉండిపోయేవాళ్లం" – సుశీల సమాధానంలో నారాయణ ముగ్గురక్కలకీ పొగరు కనిపించలేదు. ఓ నిర్వేదం, ఓ నిస్సహాయతా గోచరించాయి.

నిర్మల మరి వారికెవరికీ మాట్లాడ్డాని కాస్కారం ఇవ్వకుండా బయటకు వచ్చింది. హాలు దాటి పక్కనే ఉన్న మరో గదిలోకి వెళ్లి గోడ నానుకొని నేల మీద కూర్చుంది. హాల్లోంచి వెళ్లిన ఆమెను పలకరించడానికి నారాయణ ముగ్గురు బావలకీ మాటలు దొరకలేదు.

నారాయణ కాంప్లెక్స్ కెంటీన్ నుంచి వేడివేడి ఇడ్లీలు పార్శిల్ చేయించి తీసుకొచ్చాడు. తల్లి గదిలోంచి ముగ్గురక్కలూ వచ్చి ముందు హాల్లో ఓ నవారు మంచం వాల్చుకుని కూర్చున్నారు. నిర్మల గ్లాసులలో అందరి ముందూ నీళ్లుంచింది. అందరితో బాటు నారాయణా, నిర్మలా కూడా టిఫిన్ తీసుకోవడం వాళ్లు గమనించకపోలేదు. నారాయణ కావాలనే ఇలా చేస్తున్నాడా అన్న సందేహం వాళ్ల మనసుల్లో కలగకపోనూలేదు.

పెద్దక్కే చొరవదీసుకొని ఇద్దర్నీ కాస్త మందలిస్తూ, "అమ్మ విషయంలో మీరిద్దరూ మరింత శ్రద్ధ వహించకపోతే ఎలా? కాస్త మంచి డాక్టర్లకి చూపించి ఉండాల్సింది" అంది.

నారాయణ 'ఇప్పుడే వస్తానుండండి' అని బయటకు వెళ్లి, డాబా మీద పడుకొన్న తండ్రినీ, తమ్ముణ్ణి లేపి కిందకు తీసుకొచ్చాడు. వాళ్లిద్దర్నీ చూస్తూనే నారాయణ పెద్దక్క "నాన్నగారూ, ఎలా ఉన్నా'రని పలకరించి, లేచి తను కూర్చున్న చోట తండ్రిని కూర్చోబెట్టి, తనూ మంచం కోడుకి ఆనుకొని కింద కూర్చుంది. నారాయణ తమ్ముడు మరో కోడుకి ఆనుకొని కూర్చున్నాడు.

"పెద్దక్కా ఇందాకా నువ్వన్న మాటలకు సమాధానం మీ అందరి ముందూ నాన్నగారూ, గదిలో ఉన్న అమ్మా వినేటట్లు చెప్పాలి.

"పెద్దక్కా మీకందరికీ తెలుసునో తెలియదో, తెలిసీ తెలియనట్లు ఊరుకొన్నారో నాకు తెలియదుకాని, తెలియని వయసులో నాకు చెప్పని సంగతులూ, వయసొచ్చిన తర్వాత తెలుసుకొన్న సంగతులూ మీ అందరితోబాటు తమ్ముడిక్కూడా తెలియాలని చెబుతున్నాను.

"పెద్దక్కా నీ పెళ్లికి నాన్నగారు ఎకరంన్నర భూమి అమ్మారు, చిన్నక్క పెళ్లికి మిగిలిన ఎకరం అరవై సెంట్ల భూమి అమ్మారు. ఈ ఇంటిని పురుషోత్తమరావుగారి దగ్గర తాకట్టు పెట్టి లక్షా ఎనభై వేలు అప్పు తీసుకొచ్చి బుల్లక్క పెళ్ళి చేశారు. నాన్నగారు అడిగినప్పుడల్లా అడిగిన చోటల్లా సంతకాలు చేశాను. ఇవన్నీ ఆయన స్వార్జితం కావు కాబట్టి ఆయనకి సంతకాలు అడగకనూ తప్పలేదు, నేను పెట్టకనూ తప్పలేదు. తమ్ముడి విషయంలో ఆయన పవర్ ఆఫ్ ఎటార్నీ అధికారం చెలాయించారు.

"పిత్రార్జితమైన ఆస్తులమ్మి, తాకట్లు పెట్టి సొమ్ములు తీసుకొచ్చి మీ ముగ్గురి పెళ్లిళ్లూ చేసి ఆయన మీపట్ల తమ కర్తవ్యాన్ని నెరవేర్చుకొన్నారేకాని ఈ మాత్రం ఆస్తులూ లేకపోతే ఆయనేం చేసేవారని? అమ్మినదంతా కట్నాలకీ, ఆడంబరాలకీ ఖర్చయిపోయిందే కాని, మీకంటూ ఓ పైసా కూడా మిగల్లేదు కదా! ఘనంగా పెళ్ళి జరిపించావమన్న గొప్ప మీకూ, జరిపించారన్న తృప్తి వాళ్ళకీ మిగిలిందంతే! మీ ముగ్గురికీ ఒక్కొక్క ఎకరం ఇచ్చి పెళ్లిళ్లు క్లుప్తంగా జరిపి ఉంటే ఎంత బావుండేది?

"ఏమో, పెళ్లయే సమయానికి బావగార్లందరూ వయసున్నా అందరి ఇళ్లలోలాగానే తల్లిదండ్రుల మాట జవదాటని అస్వతంత్రులుగానే ఉండిపోయారనుకొంటాను.

"అనంత విశ్వంలో ఎక్కడెక్కడో తిరుగాడుతున్న ఆత్మలకి స్త్రీ పురుష సంయోగమనేది అస్తిత్వాన్ని కలిగిస్తుంది కాబట్టి, పుట్టిన సంతానం అజన్మాంతమూ తల్లిదండ్రులకి ఋణపడి ఉండాలి. ఈ ఆధునిక యుగంలో కూడా వాళ్లిద్దరూ యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం లేకుండా నియంత్రణ లేని శృంగార యజ్ఞాలు చేసిన ఫలితంగా, మన అయిదుగురి ఆత్మలకి శరీరమనే స్థావరాలు లభించడం జరిగింది. అయితే ఆడపిల్లలుగా మీపట్ల వాళ్లు తమ ధర్మాన్ని నిర్వహించి ఓ ఇంటివాళ్లని చేసినా, పున్నామ నరకం నుండి తప్పించువాడు పుత్రుడు అనే పరలోకసంగతమైన నిర్వచనానికి బహుదూరంగా, కని, పెంచి, పెద్ద చేసినందుకు ఎవడి కోసం చేస్తాడన్న ధోరణిలో జన్మనిచ్చిన వాళ్లు ఆలోచిస్తే పుత్రుడనే పదానికి కొత్త నిర్వచనం ఇచ్చుకోవాలి.

"బుల్లక్కా నీ పెళ్లికి ముందే నాన్నగారు ఉద్యోగం నుంచి రిటైరైపోయారని తెలుసు. ఆ వచ్చే రెండు వేలు పెన్షనూ కొంతకాలం క్రితం వరకూ పురుషోత్తమరావుగారికి నెలనెలా వడ్డీ కింద ఇస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో సంసారాన్ని లాగిస్తున్నది నేనేనని మీకు వేరే చెప్పనక్కర్లేదు. ఇంకా పెద్ద చదువులు చదువుకొందామన్న ఆశలకి ఫుల్‌స్టాప్ పెట్టేసి ఉద్యోగంలో చేరవలసి వచ్చింది. చేస్తోన్నది ప్రైవేటు కంపెనీ కాబట్టి కష్టించి పన్జేస్తున్నాను, శ్రమకు తగ్గ జీతాన్నీ పొందుతున్నాను.

"అయితే నా దృష్టిలో కానిదీ, మీ అందరి దృష్టిలో అయినదీ ఓ తప్పిదం చేశాను. అదే నేను పేద కుటుంబంలోంచి వచ్చిన నిర్మలని ప్రేమించి, కట్నం లేకుండా వివాహం చేసుకోవడం. ఇప్పుడనిపిస్తోంది, అసలు ఈ ప్రేమ వివాహాలనేవి కొందరికి సుఖశాంతుల్ని శాశ్వతంగా దూరం చేస్తాయని. నేను పెళ్లి మాట తలపెట్టకుండా ఉండాల్సింది. కాని ఉప్పు కారం తింటూ వయసొచ్చిన శరీరానికి గృహస్థ ధర్మమనే ఓ సంఘసమ్మతమైన దారిని ఎన్నుకోవడంలో సంఘసమ్మతమైన కట్నాన్ని పుచ్చుకోకపోవడమే నేను చేసిన మహాపరాధం.

"రావల్సిన లాంఛనాలకి కాళ్లొచ్చాయని మీరు ముగ్గురూ ఎంతగా గింజుకొన్నారో, విలవిలలాడారో నాకు తెలియంది కాదు. అయితే మీమీ సంసారాలు, కాపురాలూ మీకున్నాయి కాబట్టి, దూరంగా ఉంటున్నారు కాబట్టి మీ ప్రభావం లేదుకాని, లేచింది మొదలు కళ్లెదురుగా ఉన్న మా ఇద్దరి మీదా అమ్మానాన్నలు ధ్వజమెత్తేశారు. కట్నంతో కొంత అప్పైనా తీరేదన్న

లాజిక్కుతో నస మొదలు పెట్టారు.

"పురుషోత్తమరావుకి వడ్డీ జమ కట్టడం మానేశారు. నా కొచ్చే జీతంలో రెండు వేలు అటు మళ్లించాను. తమ్ముడి చదువు దుంపల బడికే పరిమితం అంటూ గొడవ చేశారు. మనమందరమూ చదివిన మునిసిపల్ హైస్కూలు వాడి స్థాయికి తక్కువైపోయింది మరి! అందుకని వాణ్ణి ప్రైవేటు స్కూల్లో చేర్పించాను. ఆ ఖర్చు మీకు తెలియంది కాదు. కరెంటు బిల్లులూ, నీటి పన్నులూ, పాల బాకీలు పోగా మిగిలింది అతి జాగ్రత్తగా వాడితే అయిదుగురు మనుషుల తిండికి బొటాబొటిగా సరిపోతోంది.

"ఏమైందో ఏమోకానీ, మూణ్ణెల్ల క్రితంనుంచి అమ్మ మూలుగుడు మొదలు పెట్టింది. తలనొప్పి అంది. డాక్టరు వద్దకు తీసుకెళ్తే సిటిస్కాన్ తీయించి ఏమీ లేదన్నాడు. ఆ తర్వాత కండరాల సలుపులూ, కీళ్ల నొప్పులూ, అరికాళ్లలో మంటలూ, నడుం నొప్పీ, మెడ నొప్పీ - ఒకటేమిటి ఒకటొకటిగా రోగాలు రావడం మొదలయ్యాయి. మా మీద కసికొద్దీ, అన్నేళ్లు కాపురం చేసిన నాన్నగారు అమ్మ విషయం పట్టించుకోలేదంటే నాకు ఆశ్చర్యం వేస్తోంది.

టెస్టుల మీద టెస్టులు చేయించవలసి వచ్చింది. తడిసి మోపెడయ్యింది. కంపెనీ వాళ్లిచ్చిన లోను కరిగిపోయింది. ఉన్న సెలవులు హరించుకుపోయాయి. ప్రైవేటు కంపెనీ మూలాన వార్నింగులు కూడా తీసుకోవలసి వచ్చింది బాగా తెలుసున్న స్నేహితులవద్ద చేతులు చాచాను. అదీ అయింతర్వాత అభిమానం అడ్డొచ్చింది.

"చిన్నప్పుడు ఓ పుట్టిన రోజుకి నాయనమ్మ నా మెళ్లో వేసిన ఒంటిపేట గొలుసు ఆర్నెల్ల క్రితం అమ్మవలసి వచ్చింది తమ్ముడి ఫీజు కోసం. ఇప్పుడు నిర్మల చేతికున్న గాజులూ, మెళ్లోని మంగళసూత్రాలూ చిలకలపూడి బంగారానివి. అసలువి రెణ్ణెల్ల క్రితం అమ్మ వైద్యంలో అర్పితమైపోయాయి.

"గత పదిహేను రోజులుగా మంచం దిగడం మానేసింది నడవలేనంటుంది. కడుపులో నరాలు బిగపెడ్తున్నాయంటుంది. నిర్మల అమ్మ బరువుకి ఆధారంగా ఉంటూ చేయించవలసిన కాలకృత్యాలు చేయిస్తోంది. అయినా అమ్మ ప్రవర్తనలో ఈసడింపు తగ్గలేదు. ఎత్తిపొడుపులు మరింత ఎత్తు కెదిగాయి.

"పరీక్షలు చేయించిన, చేసిన డాక్టర్లు అంతా బాగానే ఉంది కానీ, రోగమేమిటో అంతుపట్టడంలేదు. హాస్పిటల్లో ఎడ్మిట్ చెయ్యండి, ఓ పది రోజులు నిశితంగా ఆవిణ్ణి అబ్జర్వేషన్‌లో ఉంచి రోగ నిర్ధారణా, మందుల నిర్ధారణా చెయ్యొచ్చునన్నారు. అదుగో ఆ మాట పట్టుకొంది. అప్పట్నుంచీ హాస్పిటల్లో ఎడ్మిషనూ, పెద్ద డాక్టర్లూ తప్ప మరో ధ్యాసా, త్వరగా చేయించట్లేదన్న నసా తప్ప మరోటిలేదు.

"ఈ నెల కంపెనీ వాళ్లు ఏదో బోనస్ ఇస్తున్నారు. అది ఆరు వేలకి మించదు. ఆ ఆరు వేలూ పది రోజుల అబ్జర్వేషన్‌కీ సరిపోవు. కానీ ఆ డబ్బు చేతికందగానే అమ్మని తప్పకుండా పెద్దడాక్టరు దగ్గరకు తీసుకువెడ్తాను. కడుపులోని నరాలే నలిగాయో మనసులోని ద్వారాలే

మూసుకొన్నాయో చెప్పగల చికిత్సా కేంద్రానికి తీసుకువెళ్తాను. ప్రస్తుతానికి నేను చెయ్యగలిగిందీ చెయ్యదలచుకొన్నదీ ఇదే! ఏమంటారు?"

నారాయణ కాస్సేపు ఆగాడు. ఎవరూ మాట్లాడలేదు.

"నాన్నగారిని కూడా అదే నిపుణుడికి చూపిస్తే బావుంటుందని మీలో ఒక్కరైనా అంటారని ఆశించాను. నా ఆశ నిరాశే అయింది.

"కొంతకాలం క్రితం ఓ సమయంలో ఇల్లు అమ్మేసి ఋణం తీర్చేద్దామన్నాను. ఇద్దరూ కలిసి రక్కినంత పని చేశారు కాని, అసలు అంత మొత్తం ఎలా తీర్చగలమన్న - ఇది లేకపోయింది. నేను తీసుకురాని కట్నం దాటి ఊహించే శక్తి కాని, సంపాదించే సామర్థ్యం కాని లేని నాన్నగారు పళ్లు కొరకడం తప్పించి సాధించిందేమీలేదు. ఈ బాధ్యతలన్నీ మోస్తూ ఇంటి మీద అప్పు తీర్చగల అవకాశం నాకు ముందు ముందు రావచ్చునేమో చెప్పలేను గానీ, ప్రస్తుతానికి నన్ను మానసికంగా చిత్రవధ చేస్తూ నిర్వీర్యుణ్ణి చేస్తున్నారు.

"ఎదిరించి ఇప్పుడు ఇంటిని బేరం పెట్టినా పురుషోత్తమరావు ఈ ఇంటి తాకట్టుని వాకట్టుగా మార్చాలన్న ప్రయత్నంలో బేరాలు రాకుండా చేస్తాడని ఓ సమాచారం ఈ మధ్యనే నాకు అందింది. బుల్లక్కా ఓ పని చెయ్యకూడదూ? బావగార్ని ఈ బాకీ చెల్లించి ఈ ఇంటిని స్వంతం చేసుకోమను. అమ్మనీ, నాన్నగారినీ ఓ వాటాలో అద్దె తీసుకోకుండా బతికినంతకాలం ఉండనివ్వండి. తమ్ముడి బాధ్యత తీసుకోడానికి నేనూ సిద్ధమే. నాకంటే ముఖ్యంగా నిర్మలా సిద్ధమే. వచ్చే రెండు వేల పెన్షన్‌లో అమ్మకి రెండు మెతుకులే పెడ్తారో, నాలుగు మాత్రలే మింగిస్తారో ఆయనిష్టం.

"తమ్ముడి బాధ్యత కూడా తీసుకోకుండా, కావాలంటే ఈ క్షణంలో నేనూ, నిర్మలా ఈగుమ్మం వదిలి మా బతుకులు మేం చూసుకోగలం. కని పెంచిన తల్లిదండ్రుల బంధాల్ని తెంచుకోలేక అంటున్నదీ అయినవాళ్లే కదా అని సమాధానపరుచుకొని బాధ్యతలు నెత్తి మీద పుత్రధర్మంగా వేసుకొన్నందుకు ఇద్దరూ కలిసి నా సహనానికి పరీక్ష పెట్టేశారు.

"మీకు కష్టమనిపించినా మరోమాట. వైద్యం చేయించడానికి కడుపులు బిగించుకొని, అమ్మగలిగినవి అమ్మేసి నేనూ, నిర్మలా పాట్లుపడ్డామే కానీ, వడ్డీ కట్టడం మానేసి దాచుకొంటున్న డబ్బులోంచి నాన్నగారు నయాపైసా విదల్చలేదు సరికదా ఇంతవరకూ ఇంట్లో ఉన్న అమ్మ నగలు ఎక్కడ అమ్మిపారేస్తానో అన్న భయంకొద్దీ తీసుకు వెళ్లి బ్యాంక్ లాకర్‌లో పెట్టారు. బుల్లక్క పెళ్లికే కాసు బంగారం కూడా అమ్మడానికి ఇష్టపడని అమ్మ, తన వైద్యం కోసం ఓ అర కాసైనా అమ్మి చేతిలో పెడ్తుందనుకోవడం దురాశే అవుతుంది కదూ?

"తమ్ముడెలా ఛస్తున్నాడో అన్న ధ్యాస కన్నా అమ్మ వంటి మీది బంగారం ఏమైపోతుందోనన్న భయంకొద్దీ మీరందరూ పరుగెత్తుకు వచ్చారని నేననుకొంటే తప్పులేదనుకొంటాను. వచ్చిన వాళ్లెలానూ వచ్చారు, ఆవిడ బతికి ఉండగానే మీ వాటాలేవో నిర్ధారించుకొని ఆవిడ ఇవ్వడానికి ఇష్టపడితే రేపే లాకర్ నుండి తెప్పించుకొని తీసేసుకోండి.

"ఇప్పటికే చాలా పొద్దుపోయింది. డాబా మీద పక్కలు వేస్తాను. జస్ట్ ఓ పది నిముషాలు ఓపిక పట్టండి.

"అయితే ఆఖరిగా ఒక్క మాట, జన్మనిచ్చిన తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని ప్రబోధించే ఈ సమాజంలోని అమృతతుల్యులైన వ్యక్తుల్లో అనేకులైన తల్లిదండ్రులుండవచ్చునేమో కాని, అందరు తల్లిదండ్రూలు అమృతతుల్యులు కాలేరు. అక్కలూ, బావలూ ఈ సంగతి గుర్తుంచుకోండి. ఒక్క తమ్ముడూ, నిర్మలా తప్పించి మీరందరూ నా కంటే పెద్దవాళ్లు. ఈ పరిస్థితుల్లో ఇంతకుమించి నన్నేం చెయ్యమంటారో ఆలోచించి చెప్పండి. కంగారులేదు, రేపో, ఎల్లుండో చెప్పండి. ఇంతకాలం ఓపికపట్టిన వాడికి మరో రెండు రోజులు ఎక్కువ కాదు."

నిర్మల దుప్పట్లూ, నారాయణ చాపలూ తీసుకొని డాబా మీదకు వెళ్లారు పక్కలు వేయడానికి. మిగిలిన వాళ్లందరూ ఒకరి మొహాలు మరొకరు చూసుకొంటూ కూర్చున్నారు. గదిలోంచి అన్ని మాటలూ విన్న పార్వతమ్మ మొదటిసారి కొడుకంటే భయపడింది. భవిష్యత్తుని తలుచుకొని మరీ భయపడింది.

ఉపసంహారం: ముందు చూపు లేకుండా అధిక సంతానోత్పత్తీ, వరకట్నాలూ సంసారాలనెలా చిద్రం చేస్తాయో గుర్తించిన నారాయణ బావలు ఇంటి తాకట్టు విడిపించే సహాయం చెయ్యడానికి నిశ్చయించుకొన్నారనీ–

పాలవాడి కేక వినగానే పదిహేను రోజులుగా మంచం దిగని నారాయణ తల్లి లేచి వెళ్లి పాలు తీసుకొందనీ–

ఎనిమిది గంటలకే ఇల్లు వదిలివెళ్లి ఎప్పుడు తెరుస్తారా అని బ్యాంక్ ముందు నారాయణ తండ్రి పడిగాపులు కాశాడనీ –

ఇంట్లో వాళ్లకి తెలియకుండా క్లాసులు ఎగ్గొట్టి సినిమాలు చూసే నారాయణ తమ్ముడు చదువు మీద నిజమైన శ్రద్ధ వహించాడనీ –

వగైరా వగైరాలు చెప్పి ఈ కథ ముగించవచ్చు. ఏముంది, ఇంటింటి రామాయణాల్లో ఇదో ఇంటి రామాయణమని మీరూ అనవచ్చు.

కాని చెప్పవలసిన మాట చెప్పవలసిన సమయం వచ్చినప్పుడు కనక చెప్పకపోతే, ఆమౌనం సహనాన్నీ, త్యాగాన్నీ నిర్వచిస్తుందేమో కాని, పిరికితనాన్ని కూడా సూచిస్తుంది. అందుకే యోగివేమన అంటాడు.

**చందమెఱిగి మాటఁ జక్కఁగాఁ జెప్పిన**
**నెవ్వఁడైన మాటికేల పలుకు?**
**చందమెఱిఁగి యుండ సందర్భమెఱుఁగుము**
**విశ్వదాభిరామ వినురవేమ!**

ఒకవేళ నారాయణ చెప్పాలనుకొన్న మాటలన్నీ అతని మనసులోనే ఉండిపోయి పెదవి దాటలేదనుకొంటే ఈ కథ ముగింపు...?